క్లుప్తంగా

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కొల్లిపర: ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు హామీని వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టోలో చేర్చాలని సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్, మండల గౌరవాధ్యక్షుడు రామకృష్ణ ప్రసాద్, అధ్యక్షుడు శివశంకర్ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేసి, పెన్షన్, గ్యాట్యుటీ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ కాలేషావలి, రాము, వహాబ్, వరప్రతాప కుమార్, ఝాన్సీ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



తెనాలిటౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సోమవారం మరాఠి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ వీధుల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. చిన్న వయసులోనే మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించి, అనేక కోటలను జయించి, హిందూ సామ్రాజాన్ని శివాజీ నెలకొల్పారని పలువురు కొనియాడారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి అంబటి మారుతీరామ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, నాయకులు రవి, కృష్ణ, సాయిరాజు, బాబులు, తన్నీరు శివశంకర్, సాయి, ఫణీకృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

తెనాలిఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని స్కూల్ ఆవరణలో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శనలో ఉంచి, వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

కొల్లిపర: రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు తెలిపారు. సోమవారం అత్తోట, శివలూరు, శిరిపురం గ్రామాల వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఈకేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ-కేవైసీ నమోదు చేసుకున్న పొలాలకు మాత్రమే బీమా, పంట నష్ట పరిహారం అందుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రైతు ఆర్బీకేల్లో ఈ-కేవైసీ చేయించుకుని, ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదరావూరుకు చెందిన రాయపూడి వెంకటస్వామి దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కమాదుల జాన్ పీటర్ స్వల్ప విషయమై అతనితో ఘర్షణ పడి దుర్భాషలాడడమే కాకుండా దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు సోమవారం తెలిపారు.

దేశాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ సేవలు విస్తృతం కావాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ సేవలు మరింతగా విస్తృతం కావాలని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తూ, ఏడాది కాలంగా గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్‌ను మరో ఏడాది పాటు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారిగా పొడిగిస్తూ ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు డాక్టర్ రవి శంకర్ తెలిపారు. సోమవారం ఏఎన్‌యూలో రవిశంకర్ రెడ్డి నుంచి డాక్టర్ సుధీర్‌కుమార్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సుధీర్‌కుమార్ చేసిన సేవలకు గుర్తింపుగా మరో ఏడాది కాలం పొడిగించినట్లు పేర్కొన్నారు. వీసీ రాజశేఖర్, సమన్వయకర్త రవిశంకర్ రెడ్డి, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ధన్యవాదాలు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చల్లావారిపాలెంకు చెందిన లక్కిరెడ్డి శివరామకృష్ణ నగరంలోని కంకరగుంట సమీపంలోని ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. షాపులోని మద్యం బాటిళ్లను అక్రమంగా ఇంటికి తరలించి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రామకృష్ణారెడ్డి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 133 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోలేదు
- అన్ని హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే శివకుమార్



వైఎస్సార్ ఆసరా నమూన నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవితాల్లో సంక్షేమ పథకాలతో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. తెనాలి రూరల్ పరిధిలో 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించారు. వేలాది మంది హాజరైన సభకు పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ రూ.12.96కోట్ల నమూనా నగదు చెక్కును డ్వాక్రా సంఘాల మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రూ.12 వేల కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి, మాట నిలుపుకోలేదని గుర్తుచేశారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వడ్డీతో సహా రూ.25 వేల కోట్లకు చేరిన డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా మహిళల ఖాతాల్లో జమచేశారన్నారు. కేవలం తెనాలి రూరల్ మండలంలోని డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మొత్తం రూ.52 కోట్లను ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్ చేయూత పథకంతో ఏటా రూ.18,750 చొప్పున ఆర్థికసాయం చేసింది జగన్ ప్రభుత్వమేనన్నారు. రెండేళ్లపాటు కరోనా విలయతాండవం చేసినా.. ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపలేదన్నారు. గతంలో ప్రజలకిచ్చిన హామీలు నిలుపుకోలేని నాయకులు ఇప్పుడు పొత్తులతో అంతా కలిసి వస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. బటన్ నొక్కడం మినహా సీఎం జగన్ ఏం చేశారని.. ప్రజలకు దోచిపెడుతున్నారని విమర్శించిన నాయకులు ఇప్పుడు తాము కూడా సంక్షేమం ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించాలన్నారు. ప్రజలకు నిత్యం మేలుచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని, తననూ వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ శిల్ప, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, కోపల్లె సర్పంచ్ చింతల కుమారి, కొలకలూరు ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణికుమార్, దోసపాటి నాగదేవిక, జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు కుర్రా జస్వంత్, అంగలకుదురు ఎంపీటీసీ ముప్పవరపు సంధ్యారాణి, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సేవాలయం.. సచివాలయం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: సచివాలయం.. సేవాలయమని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సోమవారం అన్నవరం గ్రామంలో రూ.40లక్షల వ్యవయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రజావసరాలు గ్రామ పరిధిలోనే తీర్చే ప్రక్రియ చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ఆలోచనలు ఎప్పుడూ ప్రజా సేవపైనే ఉంటాయని, ఈ క్రమంలోనే సచివాలయ వ్యవస్థ పుట్టుకొచ్చిందన్నారు. నేడు ప్రతి గ్రామ సచివాలయానికి పక్కా భవనం నిర్మిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయ భవనం ప్రజలపై జగనన్నకు ఉన్న అభిమానంకు చిహ్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, ఎంపీడీవో విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

గోవాడ తిరునాళ్ల సజావుగా జరిగేలా చర్యలు

మౌలిక వసతుల కల్పన, నిర్వహణపై ఆర్డీఓ సమీక్ష



తిరునాళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: గోవాడ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటులేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఆర్డీఓ హెలా షారోన్ ఆదేశించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 8న గోవాడ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ పరిధిలోని అధికారులతో సోమవారం తన కార్యాలయంలో ఆర్డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో బారిగేట్లు ఏర్పాటు చేయాలన్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వెళ్లే భక్తులకు మధ్యలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ స్టాళ్లకు విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆలయ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, పశు వైద్యులు అందుబాటులో ఉండి తమ సేవలు అందించాలని ఆర్డీఓ దిశానిర్దేశం చేశారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ, డీఎల్‌పీఓ తాతా శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి పట్టణాభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్‌రాధిక

తెనాలిఅర్బన్: పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 34వ వార్డులో సోమవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వలను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్, అంబేద్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచన విధానం ఆర్థిక అభివృద్ధి దేశ నిర్మాణం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ హాజరవుతారని, సఫాయి కర్మచారి ఆందోళన్ కన్వీనర్ బెజవాడ విల్సన్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి హాజరవుతారని తెలిపారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, ఓంకార క్షేత్రం కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో 90వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నగరసంకీర్తన, నిత్యపూజలు విశేషంగా నిర్వహించారు. పద్మావతీ, ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం రుత్వికుల వేదమంత్రాల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. పద్మనాభ శర్మ చేసిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది.

రహదారుల నిర్మాణానికి అధికారుల పర్యటన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ప్రాతూరు, కుంచనపల్లి ప్రాంతాల్లో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రాతూరు గ్రామంలో నిర్మించవలసిన రోడ్లను పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రాతూరులో రేపల్లె కనకదుర్గ వారధి కట్ట నుంచి ప్రాతూరు శివాలయం మీదుగా గుండిమెడకు వచ్చే రహదారి పూర్తిగా లోతట్టు ప్రాంతం కావడంతో వర్షాలు పడే సమయంలో రోడ్డుపై నీరు నిలబడి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణానికి కార్పొరేషన్ నిధుల నుండి రూ.46 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రూరల్ అధ్యక్షుడు సంకురు మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి కోర్టుల ప్రాంగణంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడంతో కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సదస్సులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, మండల న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అవగాహన

తెనాలిరూరల్: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత పోలీసులకు సూచించారు. పోలీసు అధికారులతో తన చాంబరులో సోమవారం ఆమె సమావేశమయ్యారు. రాజీ అయ్యే కేసులన్నిటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో ఆదా అవుతుందన్నారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. తెనాలి సబ్ డివిజన్, వేమూరు, రేపల్లె సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సమస్యలు రానీయొద్దు

- చలానాల విషయంలో నిబంధనలు అనుసరించండి
- పోలీసు, రోడ్డు రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయండి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



డ్రైవర్‌లతో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: ఆటో డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు రానీకుండా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం మంత్రి ఆటో డ్రైవర్ల సమస్యలపై రోడ్డు రవాణాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. మంత్రి రజిని మాట్లాడుతూ పాత చలానాల చెల్లింపు విషయంలో గడువు ఇవ్వాలని కోరారు. సిగ్నల్ వైలేషన్ విషయంలో నిబంధనలు అనుసరించాలని, చిన్న చిన్న వాటికి కూడా జరిమానాలు విధించే పరిస్థితులు లేకుండా చూడాలని సూచించారు. పోలీసు, రోడ్డు రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల విషయంలో అనవసరపు ఇబ్బందులు రాకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మురళీ శ్రీనివాస్, శ్రీను, లాలూ నాయక్, మురళీ, కొండలు, శివకోటిరెడ్డి, రవి, అరుణ్, పాల్గొన్నారు.

దైవజనులు ఐక్యతగా ఉండాలి

రూరల్ పాస్టర్స్ సమావేశంలో బిషప్ సుధీర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ సుధీర్‌కుమార్

తెనాలిటౌన్: ఏసుక్రీస్తు బోధనలు ప్రజలకు తెలియజేసే దైవజనులు (పాస్టర్స్) ఐక్యతగా ఉండాలని ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ సుధీర్‌కుమార్ సూచించారు. నందివెలుగు ఇందిరా కాలనీలోని యెహోవా ఈరే మందిరంలో సోమవారం రూరల్ మండల పాస్టర్స్ సమావేశం జరిగింది. సమావేశానికి మందిరం నిర్వాహకులు పాస్టర్ ఎం.బర్నబాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పాస్టర్స్ ప్రతి ఒక్కరిని గౌరవించాలని, ఐక్యతగా పరిచర్య చేయాలన్నారు. రూరల్ మండలంలో ఫెలోషిప్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. డబ్బు ముఖ్యం కాదని, సేవ ముఖ్యమన్నారు. నూతన కమిటీ ఏర్పాటుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. పాస్టర్ బర్నబాసు మాట్లాడుతూ నూతన కమిటీ ఏర్పాటుకు మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు దైవజనులు మాట్లాడారు. ప్రేమ అల్పాహార విందును ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడిగా గోపీ



తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండల వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా అంగలకుదురుకు చెందిన చుండూరు గోపి నియమితులయ్యారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల విద్యార్థి విభాగం కమిటీని పార్టీ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు ప్రకటించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు కమిటీని నియమించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్షుడిగా చుండూరు గోపి (అంగలకుదురు), ఉపాధ్యక్షుడిగా కందుల అజయ్ (కోపల్లె), దానబోయిన కోటేష్ (నందివెలుగు), ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ బాసిద్ బాషా (కొలకలూరు), వనమల గోపిచంద్ (అంగలకుదురు), చింతాబత్తిన అవినాష్ (చావవారిపాలెం), దూళ్ళ మణికంఠ (జగ్గడిగుంటపాలెం)ను నియమించారు. కార్యదర్శులుగా పాలపర్తి చైతన్య (గుడివాడ), రావూరి కల్యాణబాబు (పెదరావూరు), షేక్ జిలానీ (ఆటోనగర్), మూకర వంశీకృష్ణ (అంగలకుదురు), సకి శ్రీనివాస్ (సంగంజాగర్లమూడి)ను నియమించినట్లు మండల యువజన విభాగం అధ్యక్షుడు కుర్రా జశ్వంత్ తెలిపారు.

కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ ప్రారంభం



మాజీ కబడ్డీ క్రీడాకారుడు అర్జునరావు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో సోమవారం కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ 2024 ను మాజీ భారత కబడ్డీ క్రీడాకారుడు, విజయవాడ రైల్వే ఉద్యోగుల సంక్షేమ అధికారి నక్కల అర్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్ మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీని 2012 సంవత్సరం నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల నుంచి సుమారు 480 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్ హనుమంతరావు, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు మరువరానివి



ట్రై సైకిల్ అందజేస్తున్న క్లబ్ గవర్నర్ శంకర్‌రెడ్డి

తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సేవలు మరువరానివని క్లబ్ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ అనేక సేవ కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీ, అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కేఎల్.జగదీశ్వరాంబ, సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, గుప్తా వెంకటరత్నం, ఈదర శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వరరావు, కొఠారి చేతన్ తదితరులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



అలంకరణలో సోమసుందరేశ్వరస్వామి

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేటలోని శ్రీగంగా మీనాక్షి సోమసుందర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. గోపూజ, దేవాలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమశాలలో గణపతి హోమం, వేదోక్తంగా చేశారు. ఉపాలయాల్లో మూర్తులకు అభిషేకాలు కనులపండువగా నిర్వహించారు. మండప పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ 20వ తేదీ నవ చండీపారాయణ, చండీహోమం, సామూహిక లలిత సహస్రనామ పారాయణం జరుగుతాయని పేర్కొన్నారు. 21న మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, బిల్వార్చన చేస్తారన్నారు. మండ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 22న రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శాంతి కల్యాణం వైభవంగా జరుగుతోందన్నారు. 23న స్వామివారు, అమ్మవార్లకు నందివాహన సేవ, అన్న ప్రసాద వితరణ జరుగతాయని చెప్పారు. భక్తులకు పాల్గొని స్వామివారు, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



రమేష్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు వారి లక్ష్యసాధనకు తమ కళాశాల ఎల్లపుడూ అండగా ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకుడు సాధినేని రమేష్‌బాబుకు బెళగానికి చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఏ మినిమైజరైజెడ్ హెల్తీ ఐసోలేటెడ్ ఫిల్టరింగ్ అల్ట్రా వైట్ బ్యాండ్ రీకానిగరేబల్ మైమీ యాంటెన్నా ఫర్ వైర్ లెస్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆచార్య పీ దినేష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.రంగబాబులు ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com